# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


## మేడ్చల్ శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థినీ ఆత్మహత్యాయత్నం

మేడ్చల్ మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో దారుణం చోటుచేసుకుంది. ఫీజు కట్టలేదని పదవ తరగతి విద్యార్థిని అఖిల(16) ను ప్రిన్సిపాల్ ఫీజు కట్టలేదని అందరి ముందు తిట్టడంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్యయత్నం చేయడం జరిగింది. చికిత్స నిమిత్తం యశోద హాస్పిటల్ కు తరలించారు. విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. విద్యార్థిని కుటుంబ సభ్యులు బంధువులు మేడ్చల్ శ్రీ చైతన్య పాఠశాల ముందు ఆందోళన చేస్తున్నారు.


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A.L.L.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 13-02-2025 సంపుటి : 06 సంచిక : 275 పేజీలు : 8 వెల : రూ 1-00



## ఫ్రాన్స్‌లో భారత నూతన కాన్సులేట్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ



హైదరాబాద్ : ఫ్రాన్స్‌లోని మార్సెయిల్‌లో భారత నూతన కాన్సులేట్‌ను ప్రధాని మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. అంతకు ముందు మేక్రాన్‌తో కలిసి భారత అమరవీరులకు మోడీ నివాళులు అర్పించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల త్యాగాలకు గుర్తుగా గతంలో ఆ దేశ ప్రభుత్వం మార్సెయిల్ ప్రాంతంలో యుద్ధ స్మారకం నిర్మించింది. కామన్వెల్త్ వార్ గ్రేవ్స్ కమిషన్ చే దీని నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగినట్లు పీఎంఓ వెల్లడించింది. ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై చర్చలు జరిపినట్లు పేర్కొంది. సాంకేతికత, రక్షణ, పౌర అణుఇంధనం, అంతరిక్షం తదితర రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని అంగీకారానికి వచ్చినట్లు సమాచారం.ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ మంగళవారం పారిస్ వేదికగా జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి సహ అధ్యక్షుడిగా వ్యవహరించారు. పలు దేశాల అధినేతలు, టెక్ రంగ నిపుణులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటితో ఫ్రాన్స్ పర్యటనను ముగించుకొని.. సాయంత్రానికి అమెరికాకు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అవుతారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి భేటీ కానున్న ప్రధాని మోడీ.. పలు అంశాలపై చర్చలు జరిపే అవకాశముంది. పలు దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్న నేపథ్యంలో మోడీ అమెరికా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## ప్రాధాన్యత తెలియని వ్యక్తులు పాలన చేస్తే..

గుంటూరు, ఫిబ్రవరి 12: ప్రపంచాన్ని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శాసిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాబోయే రోజుల్లో డేటానే సంపద అవుతుందని ఆయన పేర్కొన్నారు. హెల్త్‌లో డేటా కింగ్‌గా కిమ్స్ చైర్మన్ బి. భాస్కర్ రావు తయారవుతారని ఆయన స్పష్టం చేశారు. బుధవారం గుంటూరులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 2000 ఏడాదిలో కిమ్స్ తొలి ఆసుపత్రిని తాను ప్రారంభించానని ఆయన గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లలో 5 వేల బెడ్స్‌తో ఐదు రాష్ట్రాలకు కిమ్స్ విస్తరించిందని చెప్పారు. క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. సంస్థ బాగుండాలంటే.. అందులో పని చేసే వాళ్లు భాగస్వాములు కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. 1995లో తాను ఐటీ గురించి చెప్పానన్నారు. ఇప్పుడు ఏఐ గురించి చెబుతున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతీయులు అద్భుతాలు సృష్టించనున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. జెనిటికల్ పరీక్షలు ద్వారా ఎటువంటి రోగాలు రాబోతున్నాయో కూడా భవిష్యత్తులో తెలియనుందన్నారు. అయితే హెల్త్ కాస్ట్ తగ్గాలని ఆయన పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవలో భాగస్వాములమవుతామన్నారు. నేచురల్ ఫుడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 ఏపీలో చేయబోతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడే రోజు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇక వాట్సాప్‌లోనే అన్ని సర్టిఫికేట్స్ పొందవచ్చునని చెప్పారు. వివిధ రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ చేయడానికి ముందుకొచ్చే వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. సమర్థవంతమైన నాయకుడు, సుస్థిరపాలన ఉంటే అభివృద్ధి ఉంటుందన్నారు. 2019లో తెలుగు దేశం పార్టీ గెలిచి ఉంటే ఇంత విధ్వంసం జరిగి ఉండేదా? అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రశ్నించారు.ప్రాధాన్యత తెలియని వ్యక్తులు పాలన చేస్తే.. ఎలా ఉంటుందో ఎయిమ్స్‌కి నీళ్లు ఇవ్వలేక పోవడమే అందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 300 పడకలతో స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేసే దిశగా తాము ఆలోచన చేస్తు?న్నామని చెప్పారు. పేదలకు అందుబాటులో మెరుగైన పాలన ఇచ్చేలా తాము ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. 15 శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వివరించారు. రాబోయే బడ్జెట్‌ను అందుకు అనుగుణంగా రూపకల్పన చేస్తు?న్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.



## ఆర్మీపై వ్యాఖ్యలు.. రాహుల్ గాంధీకి లక్నో కోర్టు సమన్లు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కి బిగ్ షాక్ తగిలింది. ఆర్మీపై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో లక్నో కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే నెలలో కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది.2022 డిసెంబర్‌లో భారత్ జోడో యాత్ర సందర్భంగా భారత సైన్యాన్ని అవమానించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. 'చైనా గురించి మీడియా నన్ను ఏమీ అడగదని నేను నా స్నేహితుడితో పందెం కాశాను. రెండు వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిన దేశం గురించి, మన సైనికులను చంపిన దేశం గురించి, అరుణాచల్ ప్రదేశ్‌లో మన సైనికులపై దాడులు చేస్తున్న దేశం గురించి ప్రెస్ నన్ను ప్రశ్నించదు. నేను చెప్పింది నిజమే. దేశం గమనిస్తోంది, వేరేలా ఆలోచించొద్దు' అంటూ వ్యాఖ్యానించారు.రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర వివాదాస్పదమయ్యాయి. భారత సైన్యం కూడా ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించింది. 2022 డిసెంబర్ 12న రాహుల్ వ్యాఖ్యలపై ఆర్మీ స్పష్టత నిచ్చింది. చైనా ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లోకి అక్రమంగా ప్రవేశించిందని తెలిపింది. ఇండియన్ ఆర్మీ దానిని బలంగా తిప్పికొట్టినట్లు పేర్కొంది.అయితే, రాహుల్ తన వ్యాఖ్యలతో భారత ఆర్మీని అవమానించారంటూ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ ఫిర్యాదు చేశారు. సరిహద్దులను కాపాడుతున్న ఆర్మీపై ఇలాంటి వ్యాఖ్యలు తగవని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు భారత సైనిక దళాలను అవమానించేవిగా, అప్రతిష్టపాలు చేసేవిగా ఉన్నాయన్నారు. ఈ ఫిర్యాదు మేరకు లక్నో కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. మార్చి 24వ తేదీన తమ ముందు హాజరు కావాలని లక్నో స్పెషల్ ఎంపీ- ఎమ్మెల్యే కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది.



## కోళ్ల లెక్కలు తేల్చిన ప్రభుత్వం.. బర్డ్ ఫ్లూపై కీలక ప్రకటన

అమరావతి, ఫిబ్రవరి 12: బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. చనిపోయిన కోళ్లను.. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపగా.. అవి బర్డ్ ఫ్లూ వల్లే చనిపోయినట్లు నివేదికలో స్పష్టమైందని చెప్పారు. ఈ వ్యాధి వల్ల ఏలూరు జిల్లా బాదంపూడిలో 2 లక్షల కోళ్లు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో 7 వేల కోళ్లు చనిపోయినట్టు సమాచారం ఉందన్నారు.బుధవారం అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. పౌల్ట్రీలలో ఉన్న గుడ్లను కూడా పూడ్చి వేయించామని చెప్పారు. ఈ బర్డ్ ఫ్లూ కారణంగా దాదాపు 5 లక్షల కోళ్లు చనిపోయినట్లు సమాచారం ఉందని.. కానీ 40 లక్షల కోళ్లు చనిపోయినట్లు ప్రచారం అయితే జరుగుతోందన్నారు. స్వల్ప ఉష్ణోగ్రతలో ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలిపారు. ఈ బర్డ్ ఫ్లూ ప్రబలిన ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల పరిధిలోని షాపులను మూసి వేశామన్నారు. ఇక బర్డ్ ఫ్లూ వల్ల ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతలు ఎంత వేగంగా పెరిగితే అంతే వేగంగా ఈ వ్యాధి తగ్గుతుందన్నారు. పౌల్ట్రీలలో శానిటేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల ఈ వ్యాధి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 10 కోట్లకు పైగా కోళ్లు ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మరోవైపు తెలంగాణలో సైతం లక్షలాది కోళ్లు ఈ వ్యాధి వల్ల మరణిస్తున్నాయి. ఇక మార్కెట్‌లో చికెన్ ధరలు సైతం అమాంతంగా పడిపోయాయి.


## మూడో శనివారం పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టండి

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12-జిల్లాలో తాగునీరు, పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛత పాటించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో తాగునీరు, పారి శుధ్యం, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ గ్రీన్ లీఫ్ రేటింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో తాగునీరు, పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టించే అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి నుండి సేకరించిన తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంతో పాటు తడి చెత్తతో వర్మీ కంపోస్టు, పొడి చెత్తతో పేపర్ ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే సంపద తయారీ కేంద్రాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాలలో నిర్వహణ లోపం లేకుండా క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పైప్ లైన్లలో మరమ్మత్తులు, ఇతర రిపేర్లు ఏమైనా ఉంటే 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి కిచెన్ గార్డ్ ప్రమోట్ చేసేందుకు గుర్తించాలన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ ఏపీసిఎన్ఎఫ్ ల భాగస్వామ్యంతో కిచెన్ గార్డ్ ల పెంపకం ముమ్మరంగా చేపట్టాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ మూడవ శనివారం ప్రతి కార్యాలయం, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ స్థలాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛగ్రీన్ లీఫ్ రేటింగ్ కు సంబంధించి పర్యాటక ప్రదేశాలు, హోటల్స్ అసోసియేషన్ లతో సమావేశాలు నిర్వహించి డాక్యుమెంట్ తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సమాధి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.




## సిఇసి, ఇసి నియామకాలపై పిటిషన్ల విచారణ 19న

న్యూఢిల్లీ : 2023 చట్టం కింద ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్ల (ఇసిల) నియామకాలను సవాల్ చేస్తున్న పిటిషన్లను ఈ నెల 19న విచారిస్తామని సుప్రీం కోర్టు బుధవారం ప్రకటించింది. ఈ లోగా ఏమైనా సంభవిస్తే పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఆ పిటిషన్లను బుధవారం విచారిస్తామని ఇంతకుముందు ప్రకటించారని, కానీ వాటిని 19న విచారణ జాబితాలో చేర్చారని ఎన్‌జిఒ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఎడిఆర్) తరఫున హాజరవుతున్న న్యాయవాదిప్రశాంత్ భూషణ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్య కాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనంతో చెప్పారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ 18న రిటైర్ కానున్నారని, తాము సవాల్ చేసిన 2023 చట్టం కింద కొత్త సిఇసిని ప్రభుత్వం నియమించవచ్చునని, కనుక ఈ కేసును అత్యవసరంగా విచారించవలసి ఉందని ప్రశాంత్ భూషణ్ వాదించారు.'మేము ఈ కేసు విచారణను 19కి నిర్ధారిస్తున్నాం. ఈలోగా ఏమైనా సంభవిస్తే పరిణామాలు తప్పవు' అని బెంచ్ స్పష్టం చేసింది. జస్టిస్ కాంత్ అస్వస్థతతో ఉన్నందున కేసుల విచారణను 19న నిర్ధారిస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం రిజిస్ట్రీ తమకు తెలియజేసిందని ఎన్‌జిఒ తరఫున హాజరవుతున్న ప్రశాంత్ భూషణ్ చెప్పారు.ఇక అన్ని వ్యవహారాలను 19న విచారణకు చేపడతామని జస్టిస్ కాంత్ తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 3న ఈ కేసు విచారణను బుధవారానికి (12కు) నిర్ణయిస్తూ యోగ్యత ప్రాతిపదికను అంతిమంగా కేసును తేలుస్తామని స్పష్టం చేసింది.ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)తో కూడిన స్వతంత్ర కమిటీ ద్వారా నియామకానికి ఇసిలను ఎంపిక చేయవలసి ఉంటుందని 2023 నాటి తీర్పు స్పష్టం చేసిందని భూషణ్ అంతకుముందు చెప్పారు. 'వారు ఒక చట్టం తెచ్చారు. దాని కింద ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, మరొక మంత్రిని తీసుకువచ్చారు, ఆ విధంగా కమిషనర్ల నియామకం ప్రభుత్వం సంతుష్టి మేరకే జరుగుతుందన్న మాట. ఎన్నికల కమిషనర్ల నియామకానికి స్వతంత్ర కమిటీ ఉండడం అవసరం' అని భూషణ్ బెంచ్‌తో చెప్పారు. 2023 మార్చి 2 నాటి రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకారమే సిఇసి నియామకం జరపాలని కేంద్రాన్ని ఆదేశించవలసిందని కోరుతూ తాము ఒక అర్జీ దాఖలు చేశామని పిటిషనర్ కాంగ్రెస్‌కు చెందిన జయ ఠాకూర్ తరఫున హాజరవుతున్న న్యాయవాది వరుణ్ ఠాకూర్ అంతకుముందు బెంచ్‌కు తెలిపారు.



# సంపాదకీయం

గురువారం 13-02-2025

## ఏమౌతోంది... ఈ మనుష్లలకు...

ఈ భూమ్మీద అత్యంత క్రూరమైన జంతువుగా మారగలిగేది ఒక్క మనిషి మాత్రమే. రెండు కాళ్లతో పుట్టి నాలుగు కాళ్ల జంతువుగా మారేది మనిషి ఒపాతికేళ్ల కుర్రాడి నుంచి యాభై ఏళ్ల బామ్మదాకా అందరిలో విలనిజం వెర్రితలలు వేస్తోంది నేరాలకు కారణం ఏంటని.. దాని మూలాలను వెతుకుతూ వెళ్తే కనిపిస్తున్న అడ్రస్ 'ఇల్లు'. నానమ్మ కళ్లలో ఆనందం కోసం చెల్లెలి భర్తనే చంపేశారు. వయసుమళ్లిన తరువాత శాంతంగా, ప్రశాంతంగా ఉండాల్సిన నాయనమ్మే.. మనవళ్లకు పగను నూరిపోయడం వల్ల జరిగింది కాదా ఆ ఘోరం..! వంద మంది అమ్మాయిలను అనుభవించడమే లక్ష్యమట. ఆ టార్గెట్ మరిచిపోకుండా ఉండేందుకు ఏకంగా పచ్చబొట్టు పొడిపించుకున్నాడు ఛాతి మీద. హత్య చేయడానికి, అత్యాచారం చేయడానికి, కన్నవాళ్లనే చిదిమేయడానికి, కట్టుకున్నవాళ్లనే అంతమొందించడానికి.. వీటన్నింటికీ కారణాలున్నాయ్. మనిషి మృగంగా ఎప్పుడు, ఎందుకు మారతాడనడానికి కొన్ని లెక్కలున్నాయి.ఆస్తి ఇవ్వలేదని తాతను పొడిచాడు. ఒక్కసారి కాదు 73 సార్లు పొడుస్తూనే ఉన్నాడు కసిగా. తల్లి అని కూడా చూడకుండా అడ్డొచ్చిన ఆమెపైనా కత్తితో పొడిచేశాడు. మనిషిలో మానవత్వం మాయమవుతోందని చెప్పడానికి ఇదే అతిపెద్ద నిదర్శనం. అసలు.. మానవత్వం మానవత్వం అని గొంతుచించుకుంటూ అరుచుకుంటూ వెళ్తున్నాం గానీ.. కనీసం పశుత్వం అయినా మనిషిలో ఉందా అనేదే అనుమానం. భార్యను ముక్కలుముక్కలుగా నరికి, కుక్కర్‌లో ఉడికించి, ఎముకలు పొడి చేసి, చెరువులో పడేశాడట. మనసులో ఎంత పశుత్వం ఉంటే అంత పనిచేయగలడు. మానిప్యులేటర్స్ అనే పదాన్ని ఈమధ్య క్రైమ్‌లో కూడా వాడుతున్నారు. సైకాలజిస్టులు క్యాటగరైజ్ చేసిన సైకో మెంటాలిటీస్.. ఈ మానిప్యులేటర్స్. ఎలా ఉంటారంటే వీళ్లు. మాటలతోనే మత్తుజల్లుతుంటారు.ఎదుటివారిని నమ్మించగలిగినప్పుడే మోసం చేయొచ్చు. అత్యంత దారుణాలు జరిగేది కూడా నమ్మిన వాళ్ల దగ్గరే. ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయిని.. తనపై నమ్మకం పెరిగేంతగా నటించాడు ఓ యువకుడు. ఇంట్లో ఫంక్షన్ ఉందని చెప్పి, ఆ అమ్మాయిని రప్పించాడు. ఇంట్లో ఫంక్షన్ జరగడం లేదని తెలిసినా సరే.. అక్కడే తన కాలేజ్‌లో చదువుతున్న మరో యువకుడిని చూసి ఏం కాదులే అని నమ్మిందా అభాగ్యురాలు. ఆ నమ్మకమే, అలా నమ్మడం వల్లే ఆ తరువాత నరకం చూసింది. పిలిచిన వ్యక్తి ప్లస్ ఆ తోటి విద్యార్థి.. ఇద్దరూ బయట కాపలాగా ఉంటే.. మూడో వ్యక్తి వచ్చి అత్యాచారం చేశాడు. పైగా ఆ అరుపులు బయటకు వినించకుండా సౌండ్ బాక్సులు పెట్టారట. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో జరిగిందీ దారుణం.ఆడపిల్లల జీవితాలతో మస్తాన్ సాయి ఆడుకుంటూపోయాడని చెబుతున్నారు మానసిక వైద్యులు. ప్రభాకర్ అనే సైకోమెంటాలిటీ ఉన్నవాడిని ఈ మధ్యే చూశాం. వంద మంది అమ్మాయిలే టార్గెట్ అట. ఎంత మానిప్యులేటర్ కాకపోతే.. అంతమందిని లక్ష్యంగా పెట్టుకుంటాడు. మాటలు, మంచితనాన్ని అడ్డుపెట్టి ఎంతమంది అమ్మాయిలను నమ్మించి మోసం చేసి ఉంటాడు. మీర్‌పేటలో భార్యను కిరాతకంగా చంపిన గురుమూర్తినే చూడండి. ఆ చుట్టుపక్కల ఎవరిని అడిగినా సరే.. 'అరె.. అతను చాలా మంచివాడే, ఇలా ఎలా చేశాడు, అసలు అంత దారుణమైన పని చేస్తాడని ఊహించనే లేదు' అనే చెప్పారంతా. హీ ఈజ్ ఆల్సో ఏ వెరీ గుడ్ మానిప్యులేటర్.ఇదనే కాదు.. చిన్న పిల్లలపై, మైనర్లపై అఘాయిత్యాలు చేసేది అలా నమ్మించే వాళ్లే. అన్న కదా, అక్కా అని పిలిచాడు కదా, బాబాయ్, పెదనాన్న, తాతే కదా అని నమ్మకంతో వెళ్లినందుకు ఎంతమంది ఆడపిల్లలు బలైపోతున్నారో. ఆ పశుప్రవృత్తికి కారణం.. 'విషయం బయటకు తెలిస్తే తమ పరువే పోతుందని స్వయంగా తల్లిదండ్రులే భయపడడం'. కామాంధుల బలం కూడా అదే. బయటకు చెప్పుకోలేరు అనే అస్త్రాన్ని ప్రయోగించి.. అయినవాళ్లనే, వావివరసలు మరిచి ప్రవర్తిస్తుంటారు. కొన్ని గణాంకాలు కూడా ఉన్నాయ్. ఎన్సీఆర్బీ–2016 రిపోర్ట్ ప్రకారం మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార కేసుల్లో.. 94 శాతం దోషులు ఆ కుటుంబానికి బాగా తెలిసిన వాళ్లు, దగ్గర వాళ్లే. ఆ దోషులలో 29 శాతం మంది ఇరుగుపొరుగు వాళ్లు, 27 శాతం పెళ్లి చేసుకుంటామని హామీ ఇచ్చిన వాళ్లు, 6 శాతం బంధువులు, మిగతా 30 శాతం ఆ కుటుంబానికి చాలా దగ్గరగా ఉండేవాళ్లు. సో, ఒక్కోసారి నమ్మకమే ప్రమాదకరం. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇద్దరు పసిపిల్లలను కొట్టిన తీరు చూసి.. వైద్యం చేసిన డాక్టర్లే కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతలా కొట్టడానికి మనసెలా వచ్చిందని. పిల్లల్ని అలా కొట్టడానికి కారణం ఏంటో తెలుసా. వివాహేతర సంబంధం. తన వ్యవహారానికి పిల్లలు అడ్డొస్తున్నారని ఫోన్ ఛార్జర్ వైర్‌తో కొడుతుంటే.. చర్మం చిరిగిపోయి, రక్తం బయటకు చిమ్మింది. అక్కడితో ఆగలేదు. ఆ గాయాలపై కారం పూశారట. 9 ఏళ్ల బాలుడు అనుభవించిన టార్చర్ వింటే ఎవరికైనా కన్నీళ్లొస్తాయ్. ఆ బాలుడి చెల్లెలు.. వయసు ఐదేళ్లుంటాయి.. ఆ చిన్నారిని కూడా వాతలు తేలేలా కొట్టాడు. ఆ అడ్డమైన సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారన్న కోపంతో చేసిన దుర్మార్గం ఇది.జాతివైరాన్ని మరిచిన జంతువులు' అని ఒక్కోసారి కొన్ని వీడియోలు చూస్తుంటాం. లేడిపిల్ల దగ్గరకు వచ్చినా సరే పులి ఏమీ చేయకుండా దాన్ని నాకుతూ ఉంటుంది ఆప్యాయంగా. అలాంటిది కడుపున పుట్టిన వారినే దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రవర్తిస్తున్న తల్లిదండ్రులున్నారు. 14 ఏళ్ల కొడుకుపై పిడిగుద్దులు కురిపించాడో తండ్రి. ఛాతిపై తట్టుకోలేనంత తీవ్రతతో పిడికిలి బిగించి మరీ బాదాడు. అంత దెబ్బ తగిలితే పిల్లాడు ఉంటాడా. అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.

## మాఘ పౌర్ణమి.. 1.83 కోట్ల మంది పుణ్యస్నానాలు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తుల తాకిడి పెరిగింది. ఇవాళ మాఘ పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 2 గంటల వరకూ ఏకంగా 1.83 కోట్ల మంది (కోటి 83 లక్షల మంది) భక్తులు పవిత్ర స్నానాలు చేసినట్లు యూపీ అధికారులు తెలిపారు.మాఘ పౌర్ణమి స్నానాలు ఇవాళ సాయంత్రం 7:22 వరకూ కొనసాగనున్నాయి. దాదాపు 2 నుంచి 3 కోట్ల మంది ఇవాళ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళా ప్రాంతంలో దాదాపు 15 కిలోమీటర్ల మేర రద్దీ నెలకొంది. భక్తులపై యూపీ సర్కార్ హెలికాప్టర్ల ద్వారా పూల



వర్షం కురిపించారు. 25 క్వింటాళ్ల పూలను భక్తులపై వెదజల్లారు.నేడు 'నో వెహికిల్ జోన్'గా ప్రయాగ్‌రాజ్‌మరోవైపు భక్తుల రద్దీ దృష్ట్యా యూపీ సర్కార్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. గత నెల మౌనీ అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఇవాళ మహాకుంభమేళాలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మాఘ పూర్ణిమ మంగళవారం సాయంత్రం 6.55 గంటలకు ప్రారంభమై బుధవారం రాత్రి 7.22 గంటలకు ముగుస్తుంది. మంగళవారం తెల్లవారుజాము 4 నుంచి మేళా ప్రాంతాన్ని 'నో వెహికిల్ జోన్'గా అధికారులు ప్రకటించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. దీంతో యాత్రికులు సంగమం వద్దకు దాదాపు 8 నుంచి 10 కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది. మరోవైపు ఫిబ్రవరి 8వ తేదీ నుంచి మహా కుంభమేళాకు వెళ్లే దారులన్నీ 300 కిలోమీటర్ల దూరం వరకు వాహనాలతో కిక్కిరిసిపోయాయి.కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13వ తేదీన మహాకుంభమేళా ప్రారంభమైంది. ఫిబ్రవరి 26 శివరాత్రి వరకూ ఈ కుంభమేళా కొనసాగనుంది. దాదాపు 45 రోజులపాటూ జరిగే ఈ మహా కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 55 కోట్ల మంది భక్తులు వస్తారని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్లు ఏర్పాటు చేసింది. ఇక ఇప్పటివరకు 46.25 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారు.


## వరంగల్ వచ్చే ధైర్యం లేక రాహుల్ గాంధీ పారిపోయారు : కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ వచ్చే ధైర్యం లేక పారిపోయారనిబీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలపై నిలదీస్తారనే భయంతో రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు.వరంగల్ లో రాహుల్ గాంధీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోబోరని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మకం లేక ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారని విమర్శించారు.సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి చిలుక పలుకులు పలికారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు. సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదు . రేవంత్ రెడ్డి మహిళలకు రూ .35 వేల చొప్పున బాకీ పడ్డారని ఆరోపించారు.రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని అన్నారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగుతున్నాయి,రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదని ఆరోపించారు.భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ పై అక్కసుతో కేసీఆర్ కిట్ లను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తుందని కవిత దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారని, బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఫ్రాన్స్‌లో అమరవీరులకు మోదీ శ్రద్ధాంజలి, ఇండియన్ కాన్సులేట్ ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ లో జరుపుతున్న మూడు రోజుల అధికారిక పరన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం నాడు పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. దక్షిణ మార్సెయిల్‌లోని మజార్గ్యూస్ యుద్ధ శ్వశానవాటికను సందర్శించి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధాని మెంట ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా హాజరయ్యారు. మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని కూడా మోదీ, మాక్రాన్ సంయుక్తం గా ప్రారంభించారు. కాంటినెంటల్ ఫ్రాన్స్‌లో తొలి





భారత రాయబార కార్యాలయం ప్రారంభించడం ద్వారా ఇరుదేశాల మధ్య మరింత లోతైన సంబంధాలు ఏర్పడటంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, మల్టీ డైమన్షయల్ రిలేషన్‌షిప్‌కు బలం చేకూరిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు.దీనికి ముందు పారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో మాక్రాన్‌తో కలిసి సదస్సుకు మోద అధ్యక్షత వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా చంద్రగిరి శ్రీనివాసులు

### --సత్కారం చేసిన కర్నూలు నగర బలిజ సంఘీయులు



- - విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12–ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, కొణిదెల పవన్ కళ్యాణ్ గారి ఆశీస్సులతో కర్నూలు జిల్లా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన చంద్రగిరి శ్రీనివాసులు (వాసు) ను కర్నూలు నగరంలో బుధవారం బలిజ సంఘం అధ్యక్షులు జి.లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్, గౌరవ సలహాదారులు సింగంశెట్టి సోమశేఖర్, ప్రముఖ న్యాయవాదులు వత్స, శివశంకర్ రెడ్డి, సురేష్ మరియు కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు తదితరులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు ను శాలువతో సత్కరించి పుష్ప గుచ్చాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మిఠాయిలు తినిపించి సంతోషాన్ని వారు పంచుకున్నారు.

## చిన్మయ మిషన్ పాఠశాలకు టీవీ వితరణ





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12–నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో,స్థానిక చిన్మయ మిషన్ పాఠశాలకు,భవనాశి వెంకటసుబ్బయ్య శెట్టి,శ్రీమతి వెంకమ్మ ట్రస్ట్ తరపున,లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్,ఆర్యవైశ్య నంద్యాల జిల్లా అధ్యక్షులు భవనాశి నాగ మహేష్ తమ తండ్రి భవనాశి శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యా బోధనలో ఉపయోగించడానికి పదివేల రూపాయల టెలివిజన్ వితరణ చేశారు .ఈ సందర్భంగా భవనాశి నాగ మహేష్ మాట్లాడుతూ తమ తండ్రి దివంగత భవనాశి శ్రీరామ్మూర్తి లయన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందించారని, వారి స్ఫూర్తితోనే తాము కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్,జిల్లా చైర్మన్ భవనాశి నాగ మహేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు,చిన్మయ మిషన్ స్కూల్ అధ్యక్షులు ఆంజనేయులు గుప్తా, కార్యదర్శి కశెట్టి కృష్ణమూర్తి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు బవిరిశెట్టి శ్రీకాంత్ ఉపాధ్యక్షులు కూరా ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సందీప్,సభ్యులు మేడా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులపై తనిఖీలు






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12-- పట్టణంలో పలు వీధుల్లో పారిశుధ్య పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు . అక్కడ జరుగు తున్న శానిటేషన్ పనులను డ్రైనేజీ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు చెత్త చెదారం వేయడం వల్లే మురికి కాలువలు నిండి పోతున్నాయని ఆయన అన్నారు. ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం మానుకోవాలని సూచించారు. వేసిన వారికి నోటీసులు జారీ చేయాలని సిబ్బంది కి సూచించారు . కమిషనర్ వెంట శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. లక్ష్మీనారాయణ. శివ ప్రసాద్ రెడ్డి . సచివాలయ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అన్న క్యాంటీన్లలో సమయ పాలన పాటించాలి

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి-

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12–: అన్న క్యాంటీన్ల యందు సమయ పాలన పాటించాలని అలాగే మెనూ ప్రకారం పేద ప్రజలకు ఆహారం అందించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు . బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అన్న క్యాంటిన్ల యందు బ్రేక్ ఫాస్ట్. లంచ్. డిన్నర్. సమయ పాలనలో అందించాలన్నారు. బ్రేక్ ఫాస్ట్ ఉదయం 7 నుంచి 10 గంటలవరకు. లంచ్ 12–30–నుంచి 3 గంటల వరకు. డిన్నర్ రాత్రి 7–30 నుంచి 9 గంటల వరకు కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. దాదాపు ఒక్కో అన్న క్యాంటీన్ కు ఉదయం 200 మంది. మధ్యాహ్నం 500 మంది రాత్రి డిన్నర్ కు 350 మంది వస్తున్నారని తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ . శానిటేషన్ సూపరైజర్ మురళీధర్ లక్ష్మీనారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. తదితరులు ఉన్నారు.



# వాట్సాప్ తో ఇంద్రకీలాద్రి సేవలు



విజయవాడ, ఫిబ్రవరి 12, వాట్సాప్ ద్వారా ఇంద్రకీలాద్రి సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం పౌర సేవలు సులభముగా పొందడానికి '95523 00009 అనే వాట్సాప్ నెంబర్ ను ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా దేవాదాయ శాఖ ఏపీలో రెండో ప్రధాన దేవాలయం అయిన విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దర్శనాలు, సేవలు బుక్ చేసుకోడానికి, విరాళము అందించడాన్ని సులభతరం చేసింది. ప్రతి ఒక్కరూ సులభంగా అర్థం చేసుకునేలా 9552300009 వాట్సాప్ నెంబర్ కు 'హై' అని వాట్సప్ లో మెసేజి చేయడం ద్వారా సేవలు అందుకోవచ్చునని ఆలయ ఈవో కె.రామచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతంవాట్సాప్ లో టికెట్ పొందే విధానంఅందుబాటులోకి 150 సేవలు మన మిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభించింది. 150కిపైగా సేవలు ఇక్కడ నుంచి ప్రజలు పొందవచ్చని పేర్కొంది. బస్ టికెట్లు మొదలు కొని క్యాస్ట్, ఇన్కం సర్టిఫికేట్, దేవాలయాల దర్శనాలు ఇలా 161 సేవలు లభిస్తాయి. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్ద నుంచి ఒక్క క్లిక్‌తో చాలా సేవలు లభించనున్నాయి. .ఇక్కడ క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాలనుకునే వాళ్లు రెండు విషయాలు తెలుసుకోవాలి. ఓ ఏడాదిలో ఒకసారైనా ఈ క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకున్న వాళ్లు మాత్రమే ఈ వాట్సాప్‌లో క్యాస్ట్ సర్టిఫికేట్ తీసుకోగలరు. అలా తీసుకోని వాళ్లు మాత్రం ఒకసారి నేరుగా వెళ్లి క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు క్యాస్ట్ సర్టిఫికేట్ పొందగలుగుతారు. మీరు 9552300009 నెంబర్‌ను సేవ్ చేసి పెట్టుకోండి. ఆ తర్వాత వాట్సాప్‌లోకి వెళ్లి ఆ నెంబర్‌కు మెసేజ్ పంపించాల్సి ఉంటుంది. హాయ్ అని పంపించాలి. సర్వర్ బిజీని బట్టి మీకు రిప్లై వస్తుంది. సర్వర్ బిజీగా ఉంటే లేట్‌గా రిప్లై వస్తుంది. లేకుంటే త్వరగా రిప్లై వస్తుంది. రిప్లై వచ్చిన తర్వాత సేవలను అన్వేషించండి అని వస్తుంది. ఆ సేవలను అన్వేషించండి బటన్‌పై క్లిక్ చేస్తే మెయిన్ మెనూలోకి వెళ్తారు. అక్కడ మీరు ఏ కేటగిరిలో సేవలు కావాలనుకుంటున్నారో ఆ విభాగం పై క్లిక్ చేయాలి. మీకు కావాల్సింది క్యాస్ట్ సర్టిఫికేట్ కాబట్టి రెవెన్యూ విభాగంపై క్లిక్ చేయాలి. రెవెన్యూ విభాగంపై క్లిక్ చేస్తే అందులో లభించే సేవల జాబితా మీకు కనిపిస్తుంది. అందులో 13 రకాల సేవలు ఉంటాయి. ఆ సేవల విభాగంలో మీకు క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం ప్రత్యేకంగా ఏం కాలమ్ కనిపించదు. కానీ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ జారీ అనే విభాగం ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ జారీ విభాగంపై క్లిక్ చేస్తే ఆధార్ కార్డు ఎంట్రీ చేసేందుకు కాలమ్ కనిపిస్తుంది. మీ ఆధార్ కార్డు ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. మీరు ఎంట్రీ చేసిన ఆధార్ కార్డు మీదా కాదా అని చెక్ చేసేందుకు ఓటీపీ కూడా వస్తుంది. అలా వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై క్లిక్ చేయాలి. ఒకసారి ఆధార్ వెరిఫికేషన్ పూర్తి అయిన తర్వాత మీ తండ్రి, భర్త పేరు, మతం, విద్యార్హతలు, వైవాహిక స్థితి, మెయిల్ ఐడి అడుగుతుంది. ఇక్కడ మెయిల్ ఐడీ అనేది ఆప్షనల్. ఉంటే ఇవ్వొచ్చు లేకుంటే లేదు. ఈ వివరాలు నిర్ధారించుకోమని అడుగుతుంది. ప్రభుత్వం వద్ద ఉన్న వివరాలతో మ్యాచ్ అయితే మీరు తర్వాత దశకు తీసుకెళ్తుంది. ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులతో మీ వివరాలు మ్యాచ్ కాకుంటే మాత్రం అక్కడితో సేవలు ముగిసిపోతాయి. అంటే మీరు నేరుగా వెళ్లి సర్టిఫికెట్ తీసుకోవాలని సూచిస్తుంది. ఒకసారి వివరాలు పూర్తిగా ఇచ్చిన తర్వాత సమర్పించండి అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అలా క్లిక్ చేసిన తర్వాత వాట్సాప్ ద్వారా వాళ్లకు మెసేజ్ వెళ్తుంది. కాసేపు ఆగిన తర్వాత అక్కడి నుంచి రిప్లై వస్తుంది. అందులో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేస్తే మీ వివరాలతో ఓ పేజీ వస్తుంది. అందులో ప్రస్తుతం మీరు ఉన్న అడ్రెస్, పర్మినెంట్ అడ్రెస్ ఒకటై ఉంటే అక్కడ ఉండే ఓ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. లేదంటే ప్రజెంట్ అడ్రెస్ కింద క్లిక్ చేసి అడ్రెస్ రాయాల్సి ఉంటుంది. ఇన్ని వివరాలు ఇచ్చిన తర్వాత కొనసాగించండీ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే మీకు ఓ నెంబర్ కేటాయిస్తున్నట్లు వస్తుంది. గతంలో మీకు సర్టిఫికెట్ వచ్చి ఉంటే దాన్ని మీరు ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అలా ఎంటర్ చేసిన తర్వాత శాశ్వత చిరునామా లేకుంటే తాత్కాలిక చిరునామా అని అడుగుతుంది. అందులో ఏది కావాలంటే దాన్ని మీరు క్లిక్ చేస్తే మీ ఊరి పేరు ఇతర వివరాలు కనిపిస్తాయి. అక్కడ ముందుగా మీరు ఊరి పేరు సెలెక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత మీరు రెండోసారి ఎందుకు అప్లై చేస్తున్నారో చెప్పాల్సి ఉంటుంది. దీనికి రిలేటెడ్‌గా నాలుగు ఆప్షన్స్ ఉంటాయి. స్కూల్, కాలేజీలో అడ్మిషన్ కోసమా లేదా. ఉపాధి కోసమా, ఏవైనా స్కీమ్స్ కోసమా, రుణాల కోసమా, లేదా పేరు దిద్దుబాటు కోసమా అని చెప్పాల్సి ఉంటుంది. అలా క్లిక్ చేసిన తర్వాత ముందుకెళ్లండి అనే ఆప్షన్‌పై నొక్కితే అప్లికెంట్ పూర్తి వివరాలు వస్తాయి. అప్లై చేసిన వ్యక్తి ఎవరు, వయసు, తండ్రి పేరు, ఊరు, ఎప్పుడు అప్లై చేశారు. ఎప్పుడు అప్రూవ్ అయింది. ఇలా అన్ని వివరాలు వస్తాయి. ఆ తర్వాత చివరిగా ఉన్న రెండు ఆప్షన్స్‌పై క్లిక్ చేసి సమర్పించండి అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేయాలి. వెంటనే రెవెన్యూ అధికారులకు మీ రిక్వెస్ట్ వెళ్తుంది. ఇంతలో మీకు గతంలో ఇచ్చిన క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్ కార్డును స్కాన్ చేసి పీడీఎఫ్ రెడీ చేసుకోవాలి. ఇది 1 ఎంబీ లోపు సైజు ఉండాలి. ఆ వివరాలు పంపాలని మెసేజ్ వచ్చిన వెంటనే ఈ రెండూ ఒకే ఫైల్‌లో వాట్సాప్ ద్వారానే పంపించాల్సి ఉంటుంది. ఆ వివరాలు కరెక్ట్ అయితే 40 రూపాయలు చెల్లించాలని చూపిస్తుంది. క్యాస్ట్ సర్టిఫికెట్ మరోసారి జారీ చేస్తున్నందుకు ఈ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులను కూడా అక్కడే చెల్లించవచ్చు. చెల్లించు అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి పేమెంట్ చేయాల్సి ఉంటుంది. పేమెంట్ విజయవంతమైనట్టు కూడా మెసేజ్ వస్తుంది. వచ్చిన వెంటనే సర్టిఫికెట్ వస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని వాడుకోవచ్చు. అందులో ఉండే క్యూఆర్ కోడ్ ద్వారా కూడా మీరు వాడుకోవచ్చు.


క్యాస్ట్ సర్టిఫికేట్‌తోపాటు రెసిడెన్స్, పుట్టిన తేదీ రిలేటెడ్ వివరాలు కూడా ఉంటాయి. అందుకే మూడు విషయాలు ఇంటిగ్రేట్ అయ్యి ఉంటాయి కాబట్టి దీన్ని ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ అంటారు. ఇదే క్యాస్ట్ సర్టిఫికేట్‌గా కూడా చెల్లుబాటు అవుతుంది.

# వీఐపీ వాహనాల కోసం 10 కోట్లా

విజయవాడ, ఫిబ్రవరి 12, ఏపీలో పర్యటించే విఐపిల కోసం ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పర్యాటక ప్రాంతాలు, తిరుమల వంటి పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటుగా వ్యాపార, రాజకీయ కారణాలతో పలువురు వీఐపీలు రాష్ట్రానికి వస్తుంటారు.అసలే ఖాళీ ఖజానా అంటున్నారు చంద్రబాబు. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అక్కడ డబ్బులు లేవని చెబుతున్నారు. కానీ ప్రముఖ భద్రత కోసం 10 బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకుగాను 10 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాల కొనుగోలు కోసం ఏపీ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. పది టయోటా ఫార్చునర్ వాహనాలు కొనుగోలు చేసి.. వాటిని బుల్లెట్ ప్రూఫ్ వాహనాలుగా మార్చాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ వాహనాలు రాష్ట్రంలోని ముఖ్యులతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వీఐపీల కోసం ఉపయోగించనుంది. ఈ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు కొనుగోలు కోసం ఏపీ సర్కార్ రూ. 9.20 కోట్లు ఖర్చు చేయనుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత వాహనాలనే వినియోగిస్తూ వస్తోంది. ఇప్పుడు కొత్తగా వాహనాలను సమకూర్చుకోనుండడం విశేషం.ఏపీలో పర్యటించే విఐపిల కోసం ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పర్యాటక ప్రాంతాలు, తిరుమల వంటి పుణ్యక్షేత్రాల సందర్శనతో పాటుగా వ్యాపార, రాజకీయ కారణాలతో పలువురు వీఐపీలు రాష్ట్రానికి వస్తుంటారు. అలాగే ఏపీ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ మీద ఫోకస్ పెట్టిన తరుణంలో వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు తరచూ పర్యటిస్తుంటారు. అందుకే ఏపీలోని ప్రముఖులతో పాటు రాష్ట్రానికి వచ్చే ముఖ్యులకు రక్షణగా ఉంటాయనే ఉద్దేశంతో కొత్తగా బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను ఏపీ ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఇప్పటికే ఉన్న వాహనాలకు అదనంగా ఇవి అందుబాటులోకి రానున్నాయి. కొత్త వాహనాలు కాబట్టి.. సరికొత్త హంగులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలుస్తోంది.అయితే గతంలో వైసీపీ సర్కార్ వాహనాలను ఇదే మాదిరిగా కొనుగోలు చేసింది ఆ సమయంలో టిడిపి చేసిన విమర్శలు అన్ని ఇన్ని కావు. రాష్ట్రంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అప్పట్లో ఆరోపణలు చేసింది టిడిపి. అయితే ఇప్పుడు సెక్యూరిటీ వాహనాలు ఉన్నా.. అదనంగా కొనుగోలు చేస్తుండడం విశేషం. అయితే 8 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్భాటాలకు దూరంగా ఉండాలని భావించింది. ఇదే నిర్ణయాన్ని కూటమి పార్టీల ప్రజాప్రతినిధులకు వర్తింపజేసింది. కానీ ఇప్పుడు ఏకంగా ప్రముఖుల పేరుతో దాదాపు పది కోట్ల రూపాయలు కేవలం వాహనాలకే ఖర్చు చేస్తుండడం విశేషం.చాలావరకు ఆర్భాటాలకు దూరంగా ఉన్నట్లు కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు వీరిద్దరికీ ప్రత్యేక ప్రోటోకాల్ ప్రకారం సెక్యూరిటీ కల్పిస్తున్నారు. మిగతా 23 మంది మంత్రులకు సైతం హై సెక్యూరిటీ ఉంది. అయితే ఇప్పుడు ప్రముఖుల పేరుతో ఈ కొత్తగా వాహనాలను సమకూర్చుకుంటున్నారు. అయితే ప్రభుత్వ అవసరాల కోసం అని చెబుతున్నారు. అయితే ఇవి రాష్ట్రానికి వచ్చే ప్రముఖుల కోసం అని చెప్పుకొస్తున్నారు. దీనిపై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. అప్పట్లో వైసీపీ సర్కార్ వాహనాలను కొనుగోలు చేస్తే సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా అదే మాదిరిగా ప్రత్యర్థులు ప్రచార అస్త్రంగా మార్చుకునే అవకాశం కనిపిస్తోంది

# తిరుమలలో రెడీ అవుతున్న ఫైవ్ స్టార్ హోటల్

తిరుమల, ఫిబ్రవరి 12,ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో త్వరలోనే స్టార్ హోటల్ కొలువు దీరనుంది. తిరుపతిలోని ఎస్వీ జూ పార్క్ సమీపంలో ఒబెరాయ్ గ్రూప్ సెవెన్ స్టార్ లగ్జరీ రిసార్ట్ నిర్మించనుంది. తిరుపతిలో ఒబెరాయ్ గ్రూప్ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం అడుగులు పడ్డాయి. అయితే వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. అయితే ఎట్టకేలకు మూడేళ్ల తర్వాత ఒబెరాయ్ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణానికి అడ్డంకులు తొలిగిపోయాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.తిరుపతిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటుగా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 2021లో అప్పటి వైసీపీ సర్కారు హయాంలో ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఆ నిర్ణయం ప్రకారం.. ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన మెస్సర్స్ ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్.. తిరుపతిలో లగ్జరీ రిసార్ట్ నిర్మించనుంది. ఇది పూర్తి అయితే రాయలసీమలోనే తొలి సెవెన్ స్టార్ హోటల్‌గా నిలవనుంది. మూడేళ్ల క్రితం ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటికీ అనేక కారణాలతో ఆగిపోయింది. అయితే ఏపీ ప్రభుత్వం చొరవతో తిరిగి పనులు మొదలయ్యాయి. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అనుమతులు కూడా తాజాగా మంజూరయ్యాయి. ఏడాదిన్నర కాలంలో నిర్మాణాలు పూర్తిచేసేలా పనులు ప్రారంభించారు.ఒబెరాయ్ గ్రూప్ హోటల్ నిర్మాణానికి తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో 20 ఎకరాలను వైసీపీ ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలాన్ని 66 ఏళ్ల లీజుకు కేటాయిస్తూ 2022లో జీవో జారీ అయ్యింది. 2023 జులైలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అయితే రిసార్ట్ నిర్మాణ పనులు మాత్రం మొదలెట్టలేదు.మరోవైపు తిరుమల కొండ కింద ఇలాంటి రిసార్ట్ వద్దంటూ హిందూ సంఘాలు ఆందోళనలు కూడా చేపట్టాయి. అలాగే పేరుపైనా అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ఒబెరాయ్ సంస్థ ముంతాజ్ పేరుతో ఉన్న బోర్డు తొలగించి ట్రైడెంట్ గ్రూప్ అనే బోర్డు పెట్టింది. తాజాగా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నుంచి అనుమతులు కూడా రావటంతో.. ఒబెరాయ్ గ్రూప్ రిసార్ట్ నిర్మాణ పనులు మొదలెట్టింది. ఏడాదిన్నర కాలంలో నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో పనులు జరుపుతున్నారు



# హైవోల్టేజ్‌కు ఏపీ పాలిటిక్స్

విజయవాడ, ఫిబ్రవరి 12, ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ సెషన్ ప్రారంభం కానుంది. సభాసమరం స్టార్ట్ కాకముందే ఇంతలోపే ఏపీ పాలిటిక్స్ హైవోల్టేజ్‌కు చేరుకుంటున్నాయి. మాజీ సీఎం జగన్ చుట్టే వ్యవహారం తిరుగుతోంది. వైసీపీకి పదకొండు సీట్లే ఉన్నాయ్..ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని కూటమి సర్కార్ అంటోంది. తమకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తామని వైసీపీ డిమాండ్ చేస్తోంది.ఈ పరిస్థితుల్లో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మీడియా ముందుకు వచ్చి..పెద్ద బాంబే పేల్చారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని చెప్తూనే..సభకు రాకపోతే వేటేనని కరాఖండిగా చెప్పేశారు. 60 రోజులు సభకు రాకపోతే ఆటోమేటిక్‌గా సభ్యత్వం రద్దు అవుతుందని..అది రూల్స్ బుక్‌లోనే ఉందని గుర్తు చేస్తున్నారు. దీంతో మరోసారి హీటెక్కాయి ఏపీ పాలిటిక్స్.గత ఏడాది జూన్ తర్వాత జరిగిన ఏపీ అసెంబ్లీలో అధికార పక్షమే ఉంది. విపక్ష వైసీపీ అయితే సభకు వెళ్లడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతోంది. కానీ అది అయ్యే పని కాదని రూల్స్‌ను ప్రస్తావిస్తోంది కూటమి ప్రభుత్వం. ఈ నేపథ్యంలో ఏకంగా 15రోజుల పాటు జరగబోతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరు అవుతుందా అన్నది ఆసక్తిని పెంచుతోంది.అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు అని ఒక పక్కన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. దాంతో వైసీపీ సభకు అటెండ్ కాక తప్పదా అన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీలో కూటమి పార్టీలకే 164 సీట్లు ఉన్నాయి. వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దాంతో పాటు విపక్ష హోదా ఇవ్వరు కాబట్టి జగన్‌తో పాటు అంతా సాధారణ ఎమ్మెల్యేలుగానే ఉంటారు.సాధారణ ఎమ్మెల్యేగా ఉంటే తనకు ఇచ్చే సమయం కూడా తక్కువగా ఉంటుందని అంటున్నారు జగన్. విపక్ష నేతగా ఉంటే కచ్చితంగా మైక్ దక్కుతుందని భావిస్తున్నారు. అపోజిషన్ హోదా ఉంటే సీఎం కానీ మంత్రులు కానీ మాట్లాడిన తర్వాత కౌంటర్ చేయడానికి వీలు ఉంటుంది. కానీ ఈసారి జగన్ సభకు వస్తే ఒక సాధారణ సభ్యుడికి ఇచ్చినట్లే అతి తక్కువ సమయం దక్కనుంది.ప్రతిపక్ష హోదా లేకపోతే మాట్లాడేందుకు ఎక్కువ టైమ్ ఇవ్వరని..సభకు రాకుండా ఉంటే అనర్హత వేటు వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం పెద్ద వ్యూహంతోనే ఈ బడ్జెట్ సమావేశాలకు వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న సాకు చూపి వైసీపీ సభకు అటెండ్ కాకపోతే..11 మంది ఎమ్మెల్యేల మీద వేటు వేసే అంశాన్ని పరిశీలిస్తుందట. అందులో భాగంగానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మీడియా ముందుకు వచ్చి మరీ చెప్పేశారని అంటున్నారు. ఒకవేళ చర్యలు తీసుకుంటే కూడా స్పీకర్ నిర్ణయాన్ని కోర్టులు కూడా తప్పు పట్టే అవకాశాలు ఉండవని లెక్కలు వేసుకుంటున్నారట.సిచ్యువేషన్ చూస్తుంటే బాల్ ఇప్పుడు వైసీపీ కోర్టులోనే ఉన్నట్లు కనిపిస్తోంది. వైసీపీ సభ్యులు సభకు అటెండ్ కాకపోతే ఏదో ఒక డెసిషన్ తీసుకోవాలని కూటమి సర్కార్ భావిస్తోందట. ఆ విషయం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మాటల్లో స్పష్టంగా అర్థమవుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్లబోనని ఇప్పటికే చెప్పేశారు వైసీపీ అధినేత జగన్. ఈ నెల 12న పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అవుతారని..ఆ మీటింగ్‌లో అసెంబ్లీకి హాజరు కావాలా వద్ద అన్న దానిపై ఫైనల్ డెసిషన్ తీసుకుంటారని అంటున్నారు.అయితే చాలామంది వైసీపీ నేతలు మాత్రం శాసనసభ సమావేశాలకు వెళ్లడమే బెటరనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారట. ఇచ్చిన టైమ్‌లోనే అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టేలా సబ్జెక్ట్ ప్రిపేర్ చేసుకుని వెళ్లాలని సూచిస్తున్నారట. ఒకవేళ సభలో మాట్లాడే టైమ్ ఇవ్వకపోతే వాకౌట్ చేసి ప్రెస్‌మీట్ పెట్టే అవకాశం ఉండనే ఉందని గుర్తు చేస్తున్నారట. జగన్ అసెంబ్లీకి హాజరవుతారా లేదా అనే ఉత్కంఠ కంటిన్యూ అవుతోంది. అయితే 11మందిలో ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేలు అయిన కొందరు వైసీపీ సభ్యులు..తమ నియోజకవర్గ సమస్యలను చెప్పుకోవాలని ఆశ పడుతున్నారు. అధ్యక్షా అని సభలో తన గళం వినిపించాలని అనుకుంటున్నారట. దాంతో జగన్ మనసు మార్చుకుని అసెంబ్లీ హాజరవుతారా.? లేక ఏమైనా చేసుకోనీ అని ప్రతిపక్ష హోదా డిమాండ్‌కే కట్టుబడి ఉంటారా అన్నదే చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



# కోళ్ల మరణానికి బర్డ్ ఫ్లూయే కారణం...

ఏలూరు, ఫిబ్రవరి 12, ఆంధ్రప్రదేశ్ కోళ్ల ఆకస్మిక మరణాలకు కారణం తెలిసింది. గోదావరి జిల్లాల్లో గత కొద్ది వారాలుగా లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోవడంతో కలకలం రేగింది. ఏపీ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వైరస్ ప్రభావంతో భారీగా కోళ్లు చనిపోయాయి. ఖమ్మం, సత్తుపల్లితో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోయాయి.ఈ క్రమంలో చనిపోయిన కోళ్ల నమూనాలను పశు సంవర్ధక శాఖ అధికారులు వ్యాధి నిర్ధారణ కోసం భోపాల్‌కు పంపించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో కోళ్ల మరణాలకు ఏవియన్ ఇన్ఫ్లూయెంజా (హెచ్ఎన్1 –బర్డ్ ఫ్లూ వైరస్‌ను గుర్తించారు. ఏపీలోని పలు ప్రాంతాల్లో చనిపోయిన కోళ్ల నుంచి తీసిన నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ పరీక్షలకు పంపారు.పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని కోళ్ల ఫారంల నుంచి పంపిన నమూనాలు పాజిటివ్ గుర్తించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు రెండు జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్లను పూడ్చి పెట్టారు.కోళ్ల ఫారంలకు కిలోమీటరు దూరం వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. పరిసర ప్రాంతా ల్లో వైరస్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రెడ్ జోన్‌లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేవారు. కోళ్ల ఫారాల్లో పనిచే స్తున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తున్నారు. కోళ్లకు సంక్రమిస్తున్న వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వ హిస్తున్నారు.ఏటా కొల్లేరు ప్రాంతానికి వివిధ దేశాల నుంచి వచ్చే వలస పక్షుల్లో ఉండే వైరస్ ద్వారా బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందినట్టు భావిస్తున్నారు. కొల్లేరుకు వచ్చిన పక్షులు నీటిలో రెట్టలు వేసే సమయంలో ఆ వైరస్ జలాశయాల్లోకి చేరు తోంది. నీటి ప్రవాహంతో కోళ్లకు సంక్రమిస్తున్నట్టు అంచనా వేశారు.నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో వైరస్ వేగంగా వ్యాప్తి చెందిందని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. మొదట్లో చనిపోయిన వాటిని పూడ్చి పెట్టకుండా బయట పడేయడంతో వైరస్ వ్యాప్తి చెందినట్టు గుర్తించారు. ఉష్ణోగ్రతలు 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉంటే బర్డ్ ఫ్లూ వైరస్ జీవించలేదని ప్రస్తుతం రాష్ట్రంలోని అధిక శాతం ప్రాంతాల్లో 34 డిగ్రీల పైనే నమోదవుతున్నందున వైరస్ వ్యాప్తి చెందలేదని భావిస్తున్నారు.బర్డ్ ఫ్లూగా గుర్తించిన రెండు పారాల్లోని కోళ్లు, గుడ్లను పూడ్చి పెట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చినట్టు ఏపీ పశు సంవర్ధక శాఖ ప్రకటించింది. పూడ్చి పెట్టే ఒక్కో కోడికి రూ.90 చొప్పున పరిహారం అందిస్తామని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెండు కోళ్ల ఫారాల చుట్టూ కిలోమీటరు పరిధిలో రెడ్ అలర్ట్ ప్రకటించారని అక్కడ మాత్రమే చికెన్ దుకాణాలు మూసివేయాలని మిగిలిన చోట్ల ఆంక్షలు లేవని స్పష్టత ఇచ్చారు.వైరస్ వ్యాపించిన 10 కిలోమీటర్ల పరిధి లోనూ నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు తెలిపారు. . రాష్ట్రంలోని మిగి లిన ప్రాంతాల్లో కోళ్లకు ఇబ్బంది లేదన్నారు. కోడి మాంసాన్ని అధిక ఉష్ణోగ్రతల వద్ద ఉడికిస్తున్నందున ఎలాంటి భయం లేకుండా తినొచ్చని చెబుతున్నారు.

# కష్టానికి మారుపేరు జగ్గుల సురేంద్రబాబు



విభారే న్యూస్. కర్నూలు.స్వర్గీయ సురేంద్రబాబు కు క్యాండిల్ లతో నివాళులు ఉమ్మడి కర్నూలు జిల్లా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కెమెరామెన్ జగ్గుల సురేంద్రబాబు అకాల మృతి తీరనిలోటని, కుటుంబ సభ్యులు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు కర్నూల్ రూరల్ మండలం స్వర్గీయ జగ్గుల సురేంద్రబాబు స్వగ్రామమైన దిన్నెదేవరపాడు గ్రామంలో జ్ఞాపకార్థ కూడికల్లో భాగంగా జగ్గుల సురేంద్రబాబు ఆత్మకు శాంతి కలగాలని క్యాండిల్ వెలిగించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులు పాస్టర్లు మాట్లాడుతూ జగ్గుల సురేంద్రబాబు మీడియా రంగంలో తక్కువ సమయంలోనే ప్రతి ఎక్కువ పేరు ప్రఖ్యాతలు సంపాదించడం అతి కొందరిలో జగ్గుల సురేంద్రబాబు ఒక్కరని తేజ న్యూస్, ఐ న్యూస్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి లలో కెమెరామెన్ గా పని చేసి కష్టానికి మారుపేరుగా సురేంద్రబాబు నిలిచారని కొనియాడారు. జగ్గుల సురేంద్రబాబు కుటుంబాన్ని ఆదుకునేందుకు యాజమాన్యంతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉంది అని కుటుంబ సభ్యులైన జర్నలిస్టులు అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లి రామేశ్వరి ,భార్య నాగేశ్వరి, అడ్డాకుల దేవదాస్, టీచర్ దేవన్న, మిసాల సుమలత, పాస్టర్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సురేంద్రబాబు కుటుంబానికి ఏపీ యు డబ్ల్యూజే అండగా ఉంటుంది.



విభారే న్యూస్. కర్నూలు స్వర్గీయ సురేంద్రబాబు కుటుంబాన్ని పరామర్శించిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా కెమెరామెన్ జగ్గుల సురేంద్రబాబు ఆ కాల మృతితో ఆవేదన గురైన కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, జిల్లా కార్యదర్శి నాగరాజు తో పాటు జిల్లా కమిటీ సిబ్బంది పరామర్శించారు. జగ్గుల సురేంద్రబాబు చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. అనంతరం ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు మాట్లాడుతూ సురేంద్రబాబు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు ఏపీయూడబ్ల్యూజే అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## డిప్యూటీ డి.ఇ.ఓ గా శంకర్ ప్రసాద్

### అభినందించిన ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12-నూతనంగా నియమించబడిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శంకర్ ప్రసాద్ ని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు . డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గా శంకర్ ప్రసాద్ నియామకంపై కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజులలో ప్రవేట్ పాఠశాలకు అండగా ఉంటూ ప్రవేట్ పాఠశాల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాయలసీమ రీజియన్ అధ్యక్షులు దండే దస్తగిరి కోరారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రమ్మణ్యం మాట్లాడుతూ మృదుస్వభావి, మంచి వ్యక్తి, సహాయం చేసే గుణం ఉన్న వ్యక్తిని డిప్యూటీ డీఈవో గా నియమించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సమత విద్యానికేతన్ కరస్పాండెంట్ బాలచంద్రుడు, కానల నారాయణ స్కూల్ కరస్పాండెంట్ పాండే, సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బత్తిన వెంకటేశ్వర్లు, కానాల స్టేట్ స్కూలు న్యామతుల్లా తదితర కరస్పాండెంట్లు శంకర్ ప్రసాద్ ను అభినందించారు



# బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి మురళీకృష్ణ



విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి.ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మాజీ సభ్యులు, పి మురళి కృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో డిసిసి అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గెలిచి ఆరు నెలలు గడిచిన 143 బీసీ కులాలు ఉన్నాయని ఏ ఒక్క కులానికి న్యాయం జరగలేదని బీసీలకు అన్యాయమే జరిగిందని కూటమి ప్రభుత్వం గెలిచాక బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయలేదని కూటమి ప్రభుత్వం దివ్యాంగులను, వృద్ధులను, పెన్షన్ల రీవెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ ఉదయం, సాయంత్రం తిప్పుతున్నారని గత 20, 30 సంవత్సరాలుగా ఉన్న పెన్షన్లను రివెరిఫికేషన్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని గత టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన పెన్షన్లను రీ వెరిఫికేషన్ చేయడం ఏంటని ప్రశ్నించారు. గతంలో డాక్టర్లు పరీక్షలు చేసే సర్టిఫికెట్ ఇచ్చి ఉంటారని మరి వారిని ప్రభుత్వ ఆసుపత్రికి పిలిచి ఇబ్బందులకు గురి చేయవద్దని చంద్రబాబు నాయుడు కి విజ్ఞప్తి చేశారు. బీసీలకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు 4000 రూపాయలు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, బీసీల కోసం ప్రత్యేక చట్టం బీసీ కార్పొరేషన్ ద్వారా ఐదు సంవత్సరాలలో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారని బీసీలకు రాజకీయ ప్రాధాన్యత నామినేట్ పదవులలో 34 శాతం రిజర్వేషన్ అన్నారని చట్టసభలకు బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. తక్కువ జనాభాతో ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు నామినేషన్ల ద్వారా రాజకీయ భాగస్వామ్యం కల్పిస్తామని బీసీల ఆర్థిక అభివృద్ధి ఉపాధి ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామని దామాషా పద్ధతిలో కార్పొరేషన్లకు నిధులు కేటాయించి స్వయం ఉపాధికి ఐదేళ్లలో పదివేల కోట్ల రూపాయలు వ్యయం చేస్తామన్నారు. 5000 కోట్లతో ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని యాదవులకు, కురుబలకు అత్యాధునిక ప్రమాణాలతో గొర్రెల పెంపకం యూనిట్ల స్థాపనకు రాయితీలు, గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లకు చేయూత ఇస్తామన్నారు. చేనేత ఉత్పత్తులపై రియంబర్స్ చేస్తామని, పవర్లూమ్ లకు 500 యూనిట్లకు, హ్యాండ్ లూమ్ లకు 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ దేవాలయాలలో పనిచేసే నాయి బ్రాహ్మణులకు 25 వేల వేతనం, షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అన్నారని అవి ఎక్కడ అమలు కావడం లేదని మోసపూరిత వాగ్దానాలు చేసినట్లయితే పెద్ద ఎత్తున కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రజల పక్షాన నిలబడి నిరసన చేస్తామని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఆరు నెలలు గడిచిందని ఈ ఆరు నెలలు ఏమి చేయలేదని రాబోయే రోజుల్లో బీసీలకు అన్యాయం చేయకుండా న్యాయం చేయాలని మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు మాట్లాడుతూ బీసీలకు ఎన్నో పథకాలు ఇస్తామని ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నారా లోకేష్ పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు మా ప్రభుత్వం వస్తే సంవత్సరానికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఫిబ్రవరి వచ్చిందని కానీ విడుదల చేయలేదని బీసీ మహిళలకు 3 లక్షల నుండి పది లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారని అవి అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం అన్నారు ఇంతవరకు అమలు చేయలేదని హామీలు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆంధ్రప్రదేశ్లో బీసీ కులాలు 45 శాతం ఉండారని పక్క రాష్ట్రాలలో 42 నుంచి 45% రిజర్వేషన్లు ఇస్తుంటే మన రాష్ట్రంలో 34 శాతం అమలు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని, అలాగే నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని, అలాగే బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని వారికి ఎలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదని వడ్డెర్లకు కానీ రజక కులస్తులకు కానీ ఒక ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్ప ఇతర ప్రభుత్వాలలో అన్యాయం జరుగుతుందని సాంబశివుడు గారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్ సి బజారన్న మైనార్టీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ గ పాల్గొన్నారు.

# రంజాన్ మాసంలో ఉద్యోగులకు గంట ముందస్తు అనుమతి

### సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మైనారిటీ మంత్రి ఫరూక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12- రంజాన్ పవిత్ర మాసంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులందరూ సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట సమయం ముందుగానే బయటకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. అమరావతిలో ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడిస్తూ గంట సమయం ముందస్తు అనుమతి విషయాన్ని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది, గ్రామ వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ముస్లిం ఉద్యోగులందరికీ గంట సమయం ముందుగానే బయటకు వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసంలో మార్చి 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇస్లాం మతాన్ని ఆచరించే అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు వారి కార్యాలయాలు/ పాఠశాలలను ఒక గంట సమయం ముందుగానే వీడడానికి అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల విభాగ అధిపతులకు, జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా మార్గదర్శకాలు అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. రంజాన్ మాసంలో ఒక గంట ముందుగా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ముస్లిం ఉద్యోగులు మతపరమైన ఆచారాలు నిర్వహించుకోవడానికి బయటకు వెళ్లేందుకు అనుమతించే నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

# చలో సేవాగడ్ పోస్టల్ విడుదల

### అల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు



- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12-నంద్యాల. సత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని నంద్యాల మండలం తండాలో వాల్ పోస్టులను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు విడుదల చేశారు. అనంతరం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుత్తి దగ్గర సేవా ఘాట్ లో వెలసిన బంజారాల ఆరాధన దైవం సేవలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను ఈనెల 13 14 15వ తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సాహాలకు వివిధ రాష్ట్రాల తెలంగాణ కర్ణాటక మహారాష్ట్ర రాజస్థాన్ రాష్ట్రాల్లో ఉన్న బంజారా లు అధిక సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్. కలెక్టర్లు ఉన్నంత అధికారులు ప్రముఖ బంజారా నాయకులు హాజరవుతారని తెలిపారు. వివిధ జిల్లాల నుండి బంజారా లు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారా కళాకారులచే ప్రత్యక్ష బంజారా కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుమావత్ స్వామి నాయక్ శ్రీశైలం స్వామి నాయక్. కేతావత్ బాలా నాయక్. రమేష్ నాయక్ . తిరుపాల్ నాయక్ ముని నాయక్. తిప్పా నాయక్. రవి నాయక్ విజయ నాయక్ మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మఠంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మంత్రాలయం , ఫిబ్రవరి 12, : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం సాయంత్రం వచ్చారు. వీరికి మఠం సహాయ మేనేజర్ ఐపి నరసింహ స్వామి స్వామి పలికారు.



ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వీరి వెంట ఎమ్మిగనూరు డిఎస్పీ ఉపేంద్ర బాబు , మంత్రాలయం సిఐ రామానుజులు , ఎస్ఐ శివాంజులు , ఎస్బి ఎస్ఐ వేణుగోపాల్ రాజ్ , కానిస్టేబుల్ రంగస్వామి , ఎస్బి కానిస్టేబుల్ రఘు తదితరులు ఉన్నారు.

# పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం


### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12- నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నంద్యాల సబ్ డివిజన్కుసంబందించి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణ కొరకు తీసుకోవలసిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో వివరించడం జరిగిందని అన్నారు .ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి వివరాలు మరియు పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు.గ్రేవ్ కేసులు వీగిపోకుండా ముద్దాయిలకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి.బాధితులకు న్యాయం జరగాలంటే, నేరం జరిగాక ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాలు సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యాక్రమం నందు జిల్లా ఎస్పీ గారితో పాటు నంద్యాల ఎస్ డీ పీ ఓ మంద.జావళి ఆల్ఫోన్స్ ,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు పాల్గొన్నారు.

## జంబులా పరమేశ్వరికి బోనాలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 12- నంద్యాల స్థానిక బైటిపేట శ్రీ జంబులా పరమేశ్వరి దేవి దేవస్థానం (జంబులమ్మ) నందు జరిగిన బోనాల పండుగ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బోనాలు పండుగ జరగడం చాలా సంతోషంగా ఉందని నంద్యాల నలుమూలల నుంచి ప్రజల భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించారని తెలిపారు . ఇంత ఆహ్లాదకరంగా బోనాల పండుగ జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. నంద్యాల ప్రజలను అమ్మవారు ఆశీర్వదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , అశోక్ , కాంట్రాక్టర్ రవి , కామిని మల్లికార్జున , కొమ్ము హరి , కిరణ్ , కాజా తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190